

## వేడుకగా సినీ టెక్నీషియన్స్ అవార్డుల ప్రదానం

**చెన్నైలో గురువారం సాయంత్రం సినీ టెక్నీషియన్స్ అసోసియేషన్ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది.రామనాథన్ అవార్డును ప్రముఖ దర్శకుడు బాపుకు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుగ్రహీత ఆదూరి గోపాలకృష్ణన్ అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య ఆహ్వానితుడిగా విచ్చేసిన కళాతపస్వి కె.విశ్వనాథ్‌ను అసోసియేషన్ ఘనంగా సత్కరించింది....**

# అనుభవాలే మార్గదర్శకాలు: ఆదూరి

టి.నగర్, ఆగస్టు 31 (ఆన్‌లైన్) : మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికపరమైన మార్పులను అందిపుచ్చుకుంటూ గతాన్ని మర్చిపోకుండా ముందుకు పోతే సత్ఫలితాలు వాటంతట అవే వస్తాయని, గత అనుభవాలే మనకు మార్గదర్శకంగా వుంటాయని ప్రముఖ చలనచిత్ర దర్శకులు, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత ఆదూరి గోపాలకృష్ణన్ అన్నారు. సినీ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక మౌంట్‌రోడ్డులోని దక్షిణ భారత చలనచిత్ర మండలి ఆడిటోరియంలో గురువారం జరిగిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆదూరి గోపాలకృష్ణన్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. చలనచిత్ర సాంకేతికవర్గ కళాకారుల అకుంఠిత దీక్ష, వృత్తి పట్ల నిబద్ధత, కష్టించి పనిచేసే తత్వాన్ని కలిగి వుంటారని, వీటిని చివరిదాకా కొనసాగిస్తే ఫలితాలు సంతృప్తికరంగా వస్తాయని అన్నారు. ఇలాంటి కళాకారులను అవార్డులతో సత్కరించడం అభినందనీయమని అన్నారు. ఆహ్వానితులుగా విచ్చేసిన ప్రముఖ దర్శకుడు కళాతపస్వి కె.విశ్వనాథ్ మాట్లాడుతూ, రామనాథ్ వాహినీ స్టూడియోలో పనిచేస్తున్నప్పుడు ఆయనను మొట్టమొదటిసారి చూసే భాగ్యం కలిగిందని అన్నారు. ప్రముఖ దర్శకులైన బాపు, బాలచందర్ తదితరుల దగ్గర అసోసియేట్ దర్శకుడిగా పనిచేయాలన్న చిరకాల వాంఛ తీరనేలేదని అన్నారు. కరుణానిధి అవార్డు గ్రహీతల్లో ఒకరైన పరుచూరి గోపాలకృష్ణ మాట్లాడుతూ, ఇప్పటిదాకా తనకు ఎన్నో అవార్డులు వచ్చాయని, అయితే అవన్నీ ఒక ఎత్తయితే ఇప్పుడు సినీ టెక్నీషియన్స్ అసోసియేషన్ నుంచి అందుకుంటున్న అవార్డు ఒక్కటి ఒక ఎత్తు అని అన్నారు. కార్యక్రమంలో మొదట రామనాథ్ అవార్డులను కె.శంకర్, ఎమ్మెస్ మణి, దర్శకుడు బాపు, ఆర్ఎన్ జయగోపాల్ తదితరులకు, కరుణానిధి అవార్డును పరుచూరి సోదరులకు, ఎంజీఆర్ అవార్డును విసి గుహనాథన్‌కు, పేసుం పాదం అవార్డును సంగీత దర్శకుడు ఎమ్మెస్ విశ్వనాథన్‌కు, ఎల్వీ ప్రసాద్ అవార్డును జయరాజ్‌కు, కె.సుబ్రమణ్యం అవార్డును యువ దర్శకుడు మైస్కిన్‌కు, వాన్ దేరా అవేరా అవార్డును పన్నీర్ సెల్వంకు ఆదూరి గోపాలకృష్ణన్ అందజేశారు. కార్యక్రమంలో అవార్డు ప్రదానోత్సవానికి ముందు ప్రముఖ సితార్ వాద్య విద్వాంసులు జనార్దన్ మిట్టాచే ప్రార్థనా గీతం, జాతీయ గీతాలను సితార్‌పై శ్రావ్యంగా పలికించారు. ఎస్ఎన్ఆర్ బాలసుబ్రమణ్యం వందనసమర్పణ గావించారు.